విద్యుత్ సమస్యలను పరిష్కరించండి



వివేకానందనగర్‌లో పర్యటించిన విద్యుత్ అధికారులు, చైర్‌పర్సన్

మణికొండ: ప్రజలకు ఇబ్బందిగా ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించటంతో పాటు అవసరమైన మేరకు స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి విద్యుత్ అధికారులను కోరారు. బుధవారం విద్యుత్ శాఖ డీఈ శివశంకర్, ఏడీ అంబేద్కర్, ఏఈ సందీప్‌రెడ్డిలతో కలసి తన వార్డు పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నూతన గృహాలు నిర్మించుకొని అనేక మంది నివసిస్తున్నా విద్యుత్ స్థంభాలు, వైర్లు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే వాటిని ఏర్పాటు చేస్తే వారంతా విద్యుత్ కనెక్షన్‌లను తీసుకుంటారన్నారు. కాలనీలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ల సామర్థ్యం సైతం సరిపోవటం లేదని, మరిన్నింటిని ఏర్పాటు చేయాలన్నారు.వాటిని పరిశీలించిన అధికారులు త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

22న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ)లో ఈ నెల 22వ తేదీన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 5గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం రాత్రి వరకు కొనసాగుతుందని, ఇందులో దేశ, విదేశాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు అయ్యప్ప మహా పడిపూజ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని హరిహర క్షేత్రం ఆవరణలో కొత్తగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయం ఆవరణలో గురువారం మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బాల్‌రాజ్ ముదిరాజ్ గురుస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు ఈ మహా పడిపూజ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ మహా పడిపూజ కార్యక్రమానికి అయ్యప్ప స్వాములతో పాటు భక్తులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. మహా పడిపూజ సందర్భంగా నార్సింగ్ గురుస్వామి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ పూజ కార్యక్రమానికి కేరళ నుండి శివ నరసింహ తాంత్రి హాజరవుతున్నట్లు తెలిపారు.

వీరభద్ర స్వామి దేవాలయంలో అయోధ్య అక్షింతలు



పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: అయోధ్య నుంచి పూజిత అంక్షితలు బుధవారం రాత్రి రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్ వీరభద్ర స్వామి దేవాలయానికి చేరుకున్నాయి. దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం అక్షింతలను బుద్వేల్ పురవీధుల్లో ఊరేగించి స్థానికంగా ఉన్న దేవాలయాల్లో పూజ కార్యక్రమాలు చేపట్టారు. ఈ పూజ కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు వందలాదిగా పాల్గొన్నారు.

టార్గెట్ 100 శాతం



శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బండ్లగూడ జాగీర్

ఇంటి పన్ను టార్గెట్‌కు గడువు 102 రోజులు మాత్రమే..

- కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్..

బండ్లగూడ: మూడు నెలల్లో వార్షిక సంవత్సరం ముగియనుండటంతో ఇంటి పన్నుల వసూళ్ల ప్రక్రియ జోరుగా సాగుతున్నది. కార్పొరేషన్‌లో ఆస్తిపన్ను వసూలుపై మున్సిపల్ అధికారులు దృష్టి కేంద్రీకరించారు. శరవేగంగా కార్పొరేషన్ అభివృద్ధి చెందడంతో కార్పొరేషన్‌కు పన్నుల రూపంలో ఆదాయం భారీగా సమకూరుతుంది. సుదీర్ఘకాలం పాటు ఇంటిపన్ను చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవంటున్న అధికారులు. గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అప్పుడు 30,840కు పైగా నివాసాలకు అసెస్‌మెంటు చేసి ఉండగా, కొంతమంది సకాలంలో పన్ను చెల్లించకపోవడంతో అపరాధ రుసుము రూపంలో కలిపి మొత్తం ఆదాయం 13.86 కోట్లు వసూలయ్యాయి.

రూ. 27.43 కోట్ల టార్గెట్..

ఈ ఆర్థిక సంవత్సరం 2023-24కి సంబంధించి 33,139 నివాసాలకు అసెస్‌మెంటు చేయగా, రూ. 27.43 కోట్ల టార్గెట్ నిర్దేశించగా, ఇప్పటి వరకు 11.34 కోట్ల రూపాయలు వసూలయ్యాయి. మిగితా రావలసిన రూ.16.09 కోట్లు మార్చి నెలాకరు వరకు వసూలు చేసే పనిలో పడ్డ బిల్ కలెక్టర్‌లు, కార్పొరేషన్ సిబ్బంది.

పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్..

పన్ను వసూలుకు 102 రోజులు గడువు ఉండటంతో పన్నులు వసూల్ చేయాలనే లక్ష్యంతో కార్పొరేషన్ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. రెండు సంవత్సరాల నుంచి పన్నులు కట్టని వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. స్మార్ట్‌ఫోన్ ద్వారా ప్రభుత్వం రూపొందించిన వెబ్‌సైట్ నుంచి , మీ సేవ కేంద్రాల ద్వారా చెల్లించాలని తెలుపుతూ, వందశాతం టార్గెట్‌కు చేరుకునేందుకు బిల్ కలెక్టర్‌లు, కార్పొరేషన్ సిబ్బంది కృషి చేస్తున్నారు.

పన్నుపై రాయితీలు..

మున్సిపల్ కార్పొరేషన్ పన్నుపై రాయితీ ఇస్తుంది. ఏప్రిల్ నెలలో మొత్తం సంవత్సరం పన్ను చెల్లిస్తే 5శాతం రాయితీ ఇస్తుంది. ప్రతి సంవత్సరంలో చెల్లించవలసిన పన్నులు సకాలంలో చెల్లించకపోతే పెనాల్టీ విధిస్తున్నారు. రాయితీలను సద్వినియోగం చేసుకునేవారు తక్కువగా ఉంటే చాలా మంది మార్చి నెలలోనే పన్నులు చెల్లించేందుకు మొగ్గు చూపుతున్నారు.

గతంలో కేవలం లక్షల్లో ఆదాయం వచ్చేది..

గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో కేవలం రూ.లక్షల్లో ఆదాయం వచ్చేది. పన్నులు కట్టడానికి ఆసక్తి చూపని ప్రజలు కార్పొరేషన్ ఏర్పడిన అనంతరం నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు అసెస్‌మెంట్ పూర్తి చేయడంతో పాటు ఇంటి నెంబర్లు కేటాయించి పన్నులు విధించడంతో కార్పొరేషన్‌కు ఆదాయం భారీగా పెరుగుతోంది. ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తుండడంతో ప్రజలు సైతం పన్నులు కట్టేందుకు ముందుకొస్తున్నారు.

కార్పొరేషన్ పరిధిలో 1.50 లక్షల జనాభా

మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కిస్మత్‌పూర్, దర్గా ఖలీజ్ ఖాన్, హిమాయత్ సాగర్, హైదర్ షాకోట్, బండ్లగూడజాగీర్, పీరంచెరువు, గంధం గూడ, బైరాగి గూడ తదితర ప్రాంతాలు కలిసి కార్పొరేషన్‌గా ఏర్పడింది. ప్రస్తుతం 33,139 నివాసగృహాలు ఉండగా 200 కాలనీలు ఏర్పడ్డాయి. జనాభా 1.50 లక్షల వరకు ఉంటుందని అంచనా.

పన్ను చెల్లించని వారిపై చర్యలు తప్పవు..

కార్పొరేషన్ పరిధిలో సుదీర్ఘకాలం పాటు ఇంటి పన్ను చెల్లించని వారిపై కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. పన్ను చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవంటున్న అధికారులు.



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

ఆదాయం పెంచడమే లక్ష్యంగా..



శరత్‌చంద్ర

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ కార్పొరేషన్‌కు ఆదాయం పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. కార్పొరేషన్‌లోని ప్రజలందరు సహకరించి, ప్రతిఒక్కరు బాధ్యతగా సకాలంలో పన్ను చెల్లిస్తేనే కార్పొరేషన్‌లోని మౌలిక సదుపాయాల రూపకల్పనకు, పట్టణ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చుటకు సాధ్యమవుతుంది. ప్రజలు చెల్లిస్తున్న ప్రతి రూపాయిని కార్పొరేషన్ అభివృద్ధి కోసమే ఖర్చు చేస్తాం. మొండి బకాయిదారులపై కఠిన వైఖరి ఉంటుంది. మరిన్ని అభివృద్ధి పనులకు గాను ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు.

శస్త్ర చికిత్స వికటించి మహిళ మృతి



ఆస్పత్రిలో రోదిస్తున్న కుటుంబసభ్యులు

శంషాబాద్: శస్త్రచికిత్స వికటించడంతోనే మహిళ మృతి చెందిందంటూ మృతురాలి బంధువులు పట్టణంలోని సన్‌రైజ్ ఆసుపత్రి వద్ద అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఆందోళనకు దిగారు. మహేశ్వరం మండలం డబీల్‌గూడ గ్రామానికి చెందిన నిర్మల (30) గర్భసంచిలో ఉన్న సమస్య కారణంగా పట్టణంలోని మధురానగర్ కాలనీలో ఉన్న సన్‌రైజ్ ఆసుపత్రి లో మూడు రోజుల క్రిందట చేరారు. మంగళవారం శస్త్రచికిత్స చేసిన అనంతరం రోగి బాగానే ఉన్నట్లు చెప్పిన వైద్యులు రాత్రి వరకు ఆమెను చూపించేందుకు నిరాకరించారని బంధువులు పేర్కొన్నారు. అర్ధరాత్రి తామే అక్కడికి వెళ్లి చూస్తే అప్పటికే చనిపోయి ఉందన్నారు. కనీసం కారణంగా కూడా చెప్పకుండానే వైద్యులు అక్కడి నుంచి వెళ్లిపోయారన్నారు. శస్త్రచికిత్స వికటించడంతోనే నిర్మల మృతి చెందిందని కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ముందు ఆందోళన చెపట్టారు. దీంతో ఆర్‌జీఐఏ పోలీసులు అక్కడకి చేరుకుని సముదాయించారు. బాధితుల నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదు రాలేదని ఆర్‌జీఐఏ పోలీసులు పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన హెచ్‌ఎండీఏ అధికారులు

శంషాబాద్: సుమారు 5 వందల కోట్ల పైచిలుకు భూముల్లో కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టిన వాటిని బుధవారం హెచ్‌ఎండీఏ అధికారులు మరోమారు కూల్చివేశారు. పట్టణంలోని సర్వేనంబరు 725 బై నంబర్లలో 50 ఎకరాలకు పైచిలుకు భూములు తమవేనంటు కొందరు వ్యక్తులు సంబంధిత భూముల్లో కబ్జాకు దిగడంతో ఈ ఏడాది మార్చి నెలలో ఆపరేషన్ శంషాబాద్ పేరిట హెచ్‌ఎండీఏ అధికారులు రంగంలోకి దిగి వాటిని కూల్చివేశారు. హైకోర్టును ఆశ్రయించిన అక్రమార్కులు సంబంధిత రిట్‌పిటీషన్‌లతో పాటు ఇంటి నంబర్ల ఆధారంగా చేయించకున్న రిజిస్ట్రేషన్లను అడ్డుపెట్టుకుని మరోసారి భూముల్లో పాగా వేశారు. తిరిగి నిర్మాణాలు చేయడంతో పాటు కొన్ని చోట్ల ఇనుప డబ్బాలను కూడా వేశారు. తాజా 5 రోజుల హైకోర్టు సైతం హెచ్‌ఎండీఏకు అనుకూలంగా తీర్పునిచ్చింది. అక్రమార్కులు చూపిన ఆధారాలన్ని నకిలీవిగా తేల్చింది. కోర్టు తీర్పుతో పూర్తి స్థాయిలో హక్కులు కలిగిన హెచ్‌ఎండీఏ అక్రమార్కులు ఇటీవల నిర్మాణం చేసిన వాటిని కూడా పూర్తిగా తొలగించారు.

5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు నాణ్యమైన ఇంగ్లీషు విద్యను అందించటానికి ఏర్పాటు చేసిన సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశ పరీక్షలో పాల్గొనేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రాంతీయ సమన్వయ అధికారి డాక్టర్ శారద వెంకటేష్ కోరారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు. ఫిబ్రవరి 11వ తేదీ ఉదయం 11గంటలకు ఎంపిక చేసిన కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి



అధికారులతో సమావేశమైన ఆర్‌ఆర్ సౌత్ సీజీఎం ఆనంద్

రాజేంద్రనగర్: విద్యుత్ వినియోగదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో అధికారులు తెలుసుకొని సత్వరమే పరిష్కరించాలని ఆర్‌ఆర్ సౌత్ సీజీఎం ఆనంద్ ఆదేశించారు. బుధవారం టీఎస్ఎస్‌పీడీసీఎల్ నూతన సీజీఎం ముషారఫ్ ఆదేశాల మేరకు సీజీఎం ఆనంద్, రాజేంద్రనగర్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎల్.గోపయ్య, రాజేంద్రనగర్ డివిజనల్ పి.రత్నాకర్ రావు, ఏడీఈ సత్యనారాయణలతో కలిసి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రేమావతిపేటలోని వినియోగదారుల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీజీఎం ఆనంద్ మాట్లాడుతూ... విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులకు గురి కాకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. వినియోగదారులు తమ ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లయితే వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ గోపి నాగమణి, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, హరినాథ చారి, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు రవీందర్, శ్రీహరి, సీటూరి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యతో పాటు జీవనోపాధి నైపుణ్యాలు



ఉన్నత విద్యామండలి కమిషనర్ బుర్రా వెంకటేశంను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: విద్యార్థులకు చదువుతో పాటు జీవనోపాధి నైపుణ్యాలు కూడా నేర్పేందుకు త్వరలోనే ప్రణాళికను రూపొందిస్తామని ఉన్నత విద్యామండలి కమిషనర్ బుర్రా వెంకటేశం అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ సంఘం బుధవారం ఆయనను కలిసి కమిషనర్‌గా నియమితులైన సందర్భంగా అభినందిస్తూ.. ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ సాధనకోసం శిక్షణ, నైపుణ్యాలు నేర్పడంతో పాటు విద్యార్థులకు స్వయం ఉపాధి వైపు మళ్లించే విధంగా ప్రోత్సహించేందుకు కృషిచేస్తామన్నారు. దీనికి ప్రభుత్వ సహకారంతో ప్రత్యేక కార్యచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. అందరి సహకారంతో విద్యార్థుల్లో విద్యానైపుణ్యాలు పెంపొందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ శ్రీనివాసరాజు, జాయింట్ డైరెక్టర్ యాదగిరి, ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్, అకాడమీ గైడెన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ బాలబాస్కర్, ప్రిన్సిపల్స్ డాక్టర్ గీతలక్ష్మి పట్నాయక్, డాక్టర్ రాజేందర్, డాక్టర్ రామచంద్రం, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ వసంత, డాక్టర్ సునంద తదితరులున్నారు.

ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటా



గోల్కొండలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్

గోల్కొండ: సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన గోల్కొండ, టోలిచౌకీ డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నా కూడా తాను ఉదయం , రాత్రి సమయంలో సమస్యలు తెలుసుకోవడానికి బస్తీలలో పర్యటిస్తున్నానన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున కార్వాన్‌లోని గోల్కొండ, లంగర్‌హౌజ్, టోలిచౌకీ డివిజన్‌లలో డ్రైనేజీ సమస్య తలెత్తిందన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన మరునాడే తాను వివిధ శాఖల అధికారులతో కలిసి వారివారి ప్రాంతాల్లో పర్యటించాలని కోరానన్నారు. గోల్కొండ మోతీదర్వాజ, ఖాజీగల్లీ, టోలిచౌకీ చౌరస్తా తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ లైన్లు దెబ్బతిన్నాయని దీని వల్ల రోడ్లపై మురుగు ప్రవహిస్తుందన్నారు. ఈ సమస్యలను దగ్గరుండి పరిష్కరించాలని ఆయన జలమండలి అధికారులను ఆదేశించారు. షేక్‌పేట్ జలమండలి డీజీఎం ఖాజా జవహర్‌అలీ, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు బదరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

నేడు జీఐఎల్‌టీలో 'సృజన టెక్ ఫెస్ట్'

రాయదుర్గం: విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ)లో గురువారం 'సృజన టెక్‌ఫెస్ట్' పేరిట ప్రత్యేక టెక్నికల్ ఫెస్ట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జీఐఎల్‌టీ ప్రిన్సిపల్ ఎస్.ఎక్బాల్‌హుస్సేన్ తెలిపారు. రాయదుర్గంలోని జీఐఎల్‌టీలో ఉదయం 9.30 గంటలకు స్పెషల్ బ్రాంచ్ క్లస్టర్ కోసం జిల్లాస్థాయి రంగారెడ్డిజిల్లా సృజన టెక్‌ఫెస్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రాజెక్టుల ద్వారా వినూత్న ఆలోచన, ఆచరణాత్మక నైపుణ్యాలను ప్రోత్సహించడమేప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థులకు కూడా తమలోని సృజనాత్మకతను, నైపుణ్యాలు, వినూత్న ఆలోచనలను వెలికితీసేందుకు అవకాశం కల్పించినట్లవుతుందన్నారు. అత్యుత్తమ ప్రాజెక్టును ఎంపిక చేసి రాష్ట్రస్థాయి సృజన టెక్‌ఫెస్ట్ పోటీలకు పంపుతామని వివరించారు.

గురుస్వామి కృష్ణమూర్తికి సన్మానం

గోల్కొండ: వరుసగా 36 ఏళ్లు అయ్యప్పస్వామి మాలధరించి ప్రతిఏటా శబరిమల వెళ్తూ.. అయ్యప్ప స్వామిపై భక్తి చాటుకున్న బొమ్మరాజు కృష్ణమూర్తి గురుస్వామిది గొప్ప వ్యక్తిత్వం అని గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్ అన్నారు. శబరిమల ముఖ్య తాంత్రికుడు మురళీనంబూద్రి చేతుల మీదుగా సెంగోల్ స్వీకరించి నగరానికి తిరిగి వచ్చిన కృష్ణమూర్తి గురుస్వామిని బుధవారం గుడిమల్కాపూర్‌లో ఘనంగా సన్మానించారు.

పాత్రికేయుడు బుర్హానుద్దీన్‌కు సన్మానం

గోల్కొండ: పాత్రికేయుల జీవితాలు ఎన్నో ఒడిదుడుకులతో కూడుకుని ఉంటాయని ప్రముఖ పాత్రికేయుడు హేతేమాద్ ఉర్దూదినపత్రిక మేనేజింగ్ డైరెక్టర్ బుర్హానుద్దీన్‌ను అన్నారు. హేతేమాద్ 18వ వార్షికోత్సవం సందర్భంగా గ్రేటర్ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మహ్మద్ జాహేద్ బుధవారం ఆయనను సన్మానించారు.

ఉచిత వైద్య శిబిరం

గోల్కొండ: మార్నింగ్ వాకర్స్ కోసం ప్రైవేటు ఆసుపత్రి వారు మెడికల్ క్యాంప్ నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని కార్వాన్ కుల్సుంపురా మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి రక్షిత్‌సాగర్ అన్నారు. బుధవారం కుల్సుంపురా పార్కులో మార్నింగ్ వాకర్స్ కోసం శ్రీకర ఆసుపత్రి వారు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వైద్య శిబిరంలో మార్నింగ్ వాకర్స్ కాకుండా వారి కుటుంబసభ్యులు, కుల్సుంపురా వాసులకు వైద్యపరీక్షలు నిర్వహించామన్నారు. శ్రీకర ఆసుపత్రికి చెందిన ఫిజిషియన్ అహేమర్ ఆలమ్, ఆర్థోపెడిక్ సర్జన్ మధు గెడ్డం, ఏఎంఎం పవన్‌కుమార్ దుబ్బులూరు తదితరులున్నారు.

IN THE COURT OF THE HON'BLE
II ADDITIONAL DISTRICT JUDGE
RANGA REDDY DISTRICT AT: L.B.NAGAR
O.S.NO.573 OF 2023

BETWEEN:
SMT RAMADEVI NADIKATTU
and others ...PLAINTIFFS
AND
SRI. Y. VENU KUMAR
and others ...DEFENDANTS
TO
4. PATHI KIRAN KUMAR
S/o Pathi Yesudas,
Aged about 47 Years, Occ:Business,
R/o. 7-1, Narsingi Village,
Gandipet Mandal, Ranga Reddy District - 500 075.

NOTICE

The Plaintiffs herein had filed the above Suit for Declaration and Consequential Injunction against the Defendants herein. The Hon'ble Court had Ordered for publication of this Notice for appearance of Defendant No. 4 in the above Suit and the matter is posted to 05.01.2024 at 10.30 A.M. Therefore, you may appear before the Hon'ble II Additional District Judge, Ranga Reddy District at L.B.Nagar either personally or through authorized Counsel or otherwise the matter will be adjudicated in due process of Law.
Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
For
M/s RESU LAW OFFICE
Advocates.
H.No.8-2-293/82/158/A,MLA's Colony, Road No.12, Banjara Hills, Hyderabad, Telangana - 500034

ఎండు పూలతో కళాకృతులు



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థులు ఎండు పూలతో తయారు చేసిన వస్తువులు

ఏజీవర్సిటీ: శ్రీ కొండ లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం పూల పరిశోధన స్థానంలో ఎండు పూల తయారీ విధానం పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండ లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం చివరి సంవత్సరం విద్యార్థులు, రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వ్యవసాయ వృత్తి విద్యా విద్యార్థులు పాల్గొని ఎండు పువ్వులతో ఫోటో ఫ్రేమ్‌లు, క్యాండిల్స్, సబ్బులు, కీ చైన్లు, చెవి రింగులు వివిధ రకాల రెసిన్ ఉత్పత్తులను ఎలా తయారు చేయాలనే అనే అంశం పై శిక్షణ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మినారాయణ, డాక్టర్ జెహ్రా సల్మా, డాక్టర్ ప్రణీత్ కుమార్, రాజేంద్రనగర్ జూనియర్ కళాశాల అధ్యాపకులు గోపికృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వ్యర్థాల పారబోత

అత్తాపూర్: అత్తాపూర్ శ్మశాన వాటికలో ఎవరికి వారు ఇష్టం వచ్చిన పద్ధతుల్లో చెత్త చెదారాలతో పాటు వ్యర్థాలను డంప్ చేస్తూ శ్మశాన వాటికకు వచ్చే వారికి తీవ్ర ఇబ్బందులను కలుగజేస్తున్నారు. అత్తాపూర్‌లో ఉన్న శ్మశాన వాటికకు ఎలాంటి గోడల నిర్మాణం లేకపోవడంతో ఖాళీ స్థలం కనిపించడంతో ఎవరికి వారు వ్యర్థాలను తెచ్చి పోస్తున్నారు. డంప్ చేసిన వ్యర్థాల కారణంగా శ్మశాన వాటిక అస్తవ్యస్తంగా మారిందని చుట్టు ప్రహరీగోడ నిర్మించాలని లేకపోతే కబ్జాదారులు కబ్జా చేసే ప్రమాదముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తూ, పాలకులు అధికారులు, దృష్టి సారించాలని కోరుతున్నారు.





ముక్కోటి ఏకాదశికి ముస్తాబు



పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్ త్రివేణి సంగం ఒడ్డున వెలసిన చారిత్రాత్మక జానకీ సమేత వీర వెంకట విజయ రాఘవ స్వామి మఠ ఆలయానికి 800 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ మఠ ఆలయం దక్షిణ కాశీ, రెండో భద్రాద్రిగా కూడా పిలవబడుతుంది. అయోధ్య రామచంద్రజీ మఠం ఆధ్వర్యంలో ఉన్న ఈ మఠ ఆలయం వైకుంఠ (ముక్కోటి) ఏకాదశికి ముస్తాబైంది. సంగం మ ఠ ఆలయంలో ఉత్తర ద్వార దర్శనంతో పాటు వైకుంఠ ఏకాదశి రోజు న విష్ణుమూర్తి మూడు అవతారాలను ఒకేచోట దర్శించుకోవచ్చు. ఉత్త ర ద్వారంలో లక్ష్మీనరసింహుడు కొలువుదీరి ఉంటాడని ఆయనను దర్శి ంచుకుని ఆయన కింద నుంచి ఆలయంలోకి ప్రవేశించే మహాభాగ్యం ఇక్కడ లభించనుంది. ఈ ఏడాది స్వామి వారికి ప్రీతిపాత్రమైన శనివారం రోజు వైకుంఠ ఏకాదశి సందర్భంగా పీఠాధిపతులు రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నుంచే వివిధ పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. వైకుంఠ ఏకాదశి రోజు ఉడికించిన ఆహార పదార్థాలను తినకుండా ఉపవాసాలు చేయడం మంచిదన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ఆయన కృపాశీస్సులతో పాటు ముక్కోటి దేవతల దీవెనలు పొందాలని పీఠాధిపతులు రాహుల్ దాస్ బాబా వివరించారు.